క్లుప్తంగా

రేపటి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 25వ తేదీ నుంచి కొత్తగా మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తామని సర్కిల్ – 3 ఏఎస్ఓ ఎన్.లక్ష్మణ్ బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్కిల్ –3లోని 70 రేషన్ షాపుల పరిధిలో 56,522 కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు ఇళ్ల వద్ద పంపిణీ చేస్తామన్నారు. విజయవాడ రూరల్ మండలంలో నున్న, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం, రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో, విజయవాడ అర్బన్ పరిధిలో 60, 61, 62, 63, 64 డివిజన్లలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను అందిస్తామని చెప్పారు.

కనకదుర్గ అమ్మవారి ఆలయ కమిటీ నియామకం

పెనమలూరు: యనమలకుదురు గ్రామం లాకు సెంటర్‌లో ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ కమిటీని ప్రభుత్వం ప్రకటించిందని ఈవో ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన శనివారం వివరాలు తెలుపుతూ కమిటీలో 9 మంది సభ్యులు ఉన్నారన్నారు. కమిటీ చైర్మన్‌గా కమ్మిలి నాగేశ్వరరావు, సభ్యులు సీహెచ్ రాంబాబు, ఎస్ విష్ణుభూపతి, బాణావత్‌నాగమ్మ, ఎం శివపార్వతి, వక్కలగడ్డ సామ్రాజ్యం, ఆర్ యువరాజు, ఏ రమేష్‌మారుతీకుమార్, కొడాలి కనకదుర్గ ఉన్నారు. ఆలయ అర్చకుడు ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఉంటారు. నూతన కమిటీ సోమవారం ప్రమాణ స్వీకారం చేస్తుందని ఈవో తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వాహణ ఇంజినీర్ పి.హరిబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్సీ ఏరియా, గ్యాస్ కంపెనీ ఏరియా, చర్చి రోడ్డు, రాయ్‌నగర్, తహసీల్దారు కార్యాలయ ఏరియా, గాడపేట, చెంచులకాలనీ, దుర్గాపురం, ఎయిర్‌పోర్ట్ సిటీ, శ్రీనగర్ కాలనీ, ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, విద్యానగర్, బుద్దవరం రోడ్డు, మండల పరిషత్ కార్యాలయం ఏరియా, సుబ్బారావునగర్, మదర్‌థెరిస్సా కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

పేలుడుతో మహిళకు గాయాలు

పెనమలూరు: పాత ప్లాస్టిక్ గ్రేడింగ్ చేస్తున్న సమయంలో పేలుడు జరగటంతో మహిళకు గాయాలైన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం సనత్‌నగర్‌కు చెందిన బి.వాసు తన ఫిర్యాదులో వివరాలు తెలుపుతూ తన తల్లి పద్మ సనత్‌నగర్ సాల్వెంట్ రోడ్డులో మురళీ ప్లాస్టిక్ దుకాణంలో ప్లాస్టిక్ గ్రేడింగ్ పని చేస్తుందన్నారు. ఆమె శుక్రవారం పాత ప్లాస్టిక్ వస్తువులు గ్రేడింగ్ చేస్తున్న సమయంలో హఠాత్తుగా పేలుడు సంభవించిందని చెప్పారు. ఈ ఘటనలో ఆమెకు గాయాలు కావడంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా ముగిసిన శ్రావణ మాసోత్సవాలు



గన్నవరం: స్థానిక పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో నెల రోజులుగా జరుగుతున్న శ్రావణ మాసోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా జరుగుతున్న శ్రీలక్ష్మీ సహస్రనామార్చనలకు కలశ ఉద్వాసన పలికారు. తొలుత శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామికి విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని మాను(మహాలక్ష్మి)కు పూజలు, అమ్మవారికి పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని గన్నవరం ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, పలువురు డైరెక్టర్లు దర్శించుకున్నారు. అనంతరం రుత్వికులను ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ సత్కరించారు.

రేపు కంకిపాడు మండల పరిషత్ సమావేశం

కంకిపాడు: కంకిపాడు మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.అనూష తెలిపారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులపై సమీక్ష ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

బెంబేలెత్తిస్తున్న గ్రామ సింహాలు

- గ్రామాల్లో కుక్కల స్వైరవిహారం
- వీధుల్లో గుంపులు, గుంపులుగా సంచారం
- పాదచారులు, వాహనదారులపై దాడి
- నియంత్రణకు చర్యలు చేపట్టాలని వినతి



హనుమాన్‌జంక్షన్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు పక్క వీధిలో గుంపుగా సంచరిస్తున్న కుక్కలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వీధుల్లో గుంపులు, గుంపులుగా తిరుగుతున్న కుక్కలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. గ్రామాల్లో ఏ వీధి చూసిన కుక్కలు విచ్చలవిడి తిరుగుతున్నాయి. రహదారులపై వెళ్తున్న పాదచారులు, ద్విచక్ర వాహనదారుల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నాయి. పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులను వీధి కుక్కలు వెంబడిస్తుండటంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

గ్రామాల్లో సముహాలుగా వీధికుక్కలు

మండల కేంద్రమైన బాపులపాడుతో పాటుగా వేలేరు, వీరవల్లి, బండారుగూడెం, మల్లవల్లి, కొత్తపల్లి, ఆరుగొలను, కాకులపాడు, కానుమోలు, ఆరుగొలను గ్రామాల్లో వీధి కుక్కలు అధిక సంఖ్యలో సంచరిస్తూ దాడులకు తెగబడుతున్నాయి. గత మూడు, నాలుగు నెలలుగా వీధి కుక్కల సంఖ్య గ్రామాల్లో విపరీతంగా పెరిగింది. వీధుల్లో ఎక్కడ చూసిన సమూహాలుగా తిరుగుతున్న కుక్కలు దర్శనమిస్తున్నారు. రోడ్లపై తిరుగుతున్న కుక్కలు ఎవరిని వదిలిపెట్టడం లేదు. రాత్రి వేళలో బైక్‌లపై వెళ్తున్న వ్యక్తులను వీధి కుక్కలు దాడి చేసేందుకు వెంబడిస్తుండటంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. అంతేకాక వీధి కుక్కల దాటికి విద్యార్థులు, చిన్నారులను రోడ్లపైకి పంపించేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు. వీధులు, అంతర్గత రోడ్లలోనే కాకుండా ప్రధాన రహదారుల్లోనూ కుక్కలు స్వైరవిహారం భయాందోళనకు గురి చేస్తున్నాయి.

నామమాత్రంగా చర్యలు

వీధి కుక్కలు అధికం కావటంపై వస్తున్న ఫిర్యాదులపై గ్రామ పంచాయతీ అధికారులు నామమాత్రపు చర్యలు చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దాడులు జరిగినప్పుడు వీధి కుక్కల పట్టివేతకు చర్యలు చేపట్టి, ఆ తర్వాత వదిలేస్తున్నారు. బాపులపాడు మండలంలో వీధి కుక్కల కాటుకు గురవుతున్న వారికి ప్రభుత్వాస్పత్రుల్లో యాంటీ రేబీస్ వ్యాక్సిన్ వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. గ్రామాల్లో విచ్చలవిడిగా పెరుగుతున్న వీధి కుక్కలను నియంత్రించేందుకు కనీసం ఏడాదికి ఒక్కసారైనా పంచాయతీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా టంగుటూరి జయంతి



విద్యానగర్‌లో నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ పరిషత్ నేతలు



ఉయ్యూరులో నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

గన్నవరం: స్థానిక విద్యానగర్‌లో బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టంగుటూరి చిత్రపటానికి పరిషత్ అధ్యక్షుడు పన్యారం విష్ణుమూర్తి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడిగా ఆయన తన యావదాస్తిని దేశ సేవకు ఖర్చుచేసిన మహానీయుడన్నారు. ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన నిస్వార్థ ప్రజా సేవకుడిగా గుర్తింపు సాధించారని చెప్పారు. బ్రాహ్మణ పరిషత్ ఉపాధ్యక్షుడు కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, కార్యదర్శి గోపరాజు సత్యపవన్ కుమార్, కోశాధికారి మామిళ్లపల్లి నాగసుబ్బారావు, కార్యవర్గ సభ్యులు యామర్తి వకుళ, అనంతనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరులో వేడుకలు..

ఉయ్యూరు: స్వాతంత్ర్య సమరయోధుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు శనివారం ఉయ్యూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీఓ శేషగిరిరావు, ఏఓ లోయ శివశంకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో టంగుటూరి జయంతి కార్యక్రమాలు నిర్వహించారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించండి



చోడవరంలో మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్



వీరపనేనిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న గురుకుల విద్యార్థులు

పెనమలూరు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయన చోడవరం, పోరంకి గ్రామాల్లో శనివారం మొక్కలు నాటారు. ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు చెట్లు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ బండి ప్రణవి, సర్పంచి కాకర్ల వెంకటరత్నం, టీడీపీ నేతలు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయా ఆనంద్‌ప్రసాద్, అనుమోలు ప్రభాకరరావు, కలపాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల, వ్యక్తిగత శుభ్రత పాటించాలి

గన్నవరంరూరల్: పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్య సమాజం సాధించాలని వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి చెప్పారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పరిశుభ్రత మన ప్రథమ కర్తవ్యం కావాలన్నారు. అనంతరం కళాశాల ఆవరణను శుభ్రం చేసి మొక్కలు నాటారు. వైస్ ప్రిన్సిపాల్ ఉషారాణి, లైబ్రేరియన్ ఉదయలక్ష్మి, పీడీ శివలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పి.నైనవరంలో సమస్యను చూపుతున్న సర్పంచి సోమయ్య

మురుగు కాల్వల్లో నీరు నిలబడకుండా చూడాలి

పి.నైనవరం(విజయవాడరూరల్): గ్రామంలోని మురుగు కాల్వల్లో నీరు నిలబడకుండా పారుదల అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని పి.నైనవరం గ్రామ సర్పంచి బట్టా సోమయ్య సిబ్బందిని ఆదేశించారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం గ్రామంలో శనివారం నిర్వహించారు. అంతర్గత రహదారుల్లో మురుగుకాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రంగా చేయాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. నీరు నిలబడితే దోమలు ఉధృతమై అనేక వ్యాధులకు కారణమవుతాయని చెప్పారు. అనంతరం గ్రామ సచివాలయ కార్యదర్శి అజేంద్ర స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అంబాపురం గ్రామ పంచాయతీ, పాతపాడు, నున్న గ్రామాల్లో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

ఫార్మా రంగంలో యువతకు ఉద్యోగావకాశాలు



శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులతో భట్టాచార్య, శరత్‌బాబు, మూర్తి తదితరులు

ఆత్కూరు(గన్నవరం): ఉంగుటూరు మండలం ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు ఎక్సలెన్స్ ఇన్ ఫార్మామాన్యుఫ్యాక్చరింగ్ స్కిల్స్‌లో కెమెస్ట్ ప్రొడక్షన్ కోర్సులో మొదటి బ్యాచ్ శిక్షణ పూర్తయిన సందర్భంగా శనివారం స్నాతకోత్సవం నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఎల్‌ఎస్‌ఎస్‌ఎస్‌డీసీ సీఈఓ గౌతం భట్టాచార్య, స్వర్ణభారత్ ట్రస్ట్ సీఈఓ జె.శరత్‌బాబు, కోహెన్స్ లైఫ్ సైన్సెస్ సీఎస్‌ఆర్ హెడ్ మూర్తి చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. భట్టాచార్య మాట్లాడుతూ...దేశంలో ఫార్మా ఉత్పత్తుల తయారీ, అనుబంధ రంగాల్లో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఆయా రంగాల్లో ప్రత్యేక నైపుణ్య శిక్షణ పొంది కొత్తగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభిస్తున్న అభ్యర్థులు చేరే సంస్థల్లో విధేయతతో దీర్ఘకాలం పనిచేయాలని ఆకాంక్షించారు. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యంగా సంస్థలు ముందుకురావాలని శరత్‌బాబు కోరారు. ఇక్కడ శిక్షణ పొందిన అభ్యర్థులు సిప్లా, గ్రాన్యూల్, సీయోన్సివివి మెడ్ ల్యాబ్స్ వంటి ప్రముఖ ఫార్మా కంపెనీల్లో ఎంపికైనట్లు మూర్తి తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్‌ఆర్) ద్వారా మరిన్ని శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ఎక్కువ మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. సెంటర్ హెడ్ ఎం.ఉదయకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



గన్నవరంరూరల్: విద్యార్థులు కళ్లను రక్షించుకోవాలని వీరపనేనిగూడెం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక పాఠశాలలో ఆత్కూరు పీహెచ్‌సీ ఆధ్వర్యాన విద్యార్థులకు శనివారం కంటి పరీక్షలు నిర్వహించారు. వీరవల్లి పీహెచ్‌సీ ఆప్తమాలజిస్ట్ కొండలరావు 235 మందిని పరీక్షించారు. వీరిలో 20 మందికి కళ్లజోళ్లు అవసరమని నిర్ధారించారు. హెచ్ఎం మాట్లాడుతూ.. విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంటూ కళ్లను కాపాడుకోవాలన్నారు. కళ్లు లేనిదే ప్రపంచం లేదని తెలుసుకోవాలన్నారు. ఆకుకూరలు, ప్రొటీన్‌లు ఆహారంలో తీసుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు పర్యవేక్షణలో వైద్య సేవలందించారు.

కిల్కారి కాల్ సేవలు ప్రయోజనకరం



కంకిపాడు: కిల్కారి కాల్ సేవలు గర్భిణులు, బాలింతలకు ప్రయోజనకరమని కిల్కారి ప్రోగ్రామ్ అధికారి రాజు తెలిపారు. ఉప్పలూరు పీహెచ్‌సీలో కిల్కారి కాల్ సర్వీసులపై ఆశ, ఏఎన్ఎం, వైద్య ఆరోగ్య సిబ్బందికి శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో రాజు మాట్లాడుతూ కిల్కారి కాల్ సేవలను కేంద్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు ప్రత్యేకంగా ప్రవేశపెట్టిందన్నారు. తల్లి, బిడ్డ ఆరోగ్య సమాచారం అందిస్తుందన్నారు. గర్భిణీ తన 4వ నెల నుంచి బిడ్డ పుట్టి ఏడాది పూర్తయ్యే వరకూ కిల్కారి కాల్ సేవలు అందుతాయన్నారు. 911600 103660 నంబరు నుంచి ఈ సేవలు గర్భిణులు, బాలింతలకు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ఎంఎస్ చంద్రిక, డాక్టర్ అంజు, ఎంపీహెచ్ఎస్ వి.శారమ్మ, టి.శ్యామల, హెచ్ఎస్ సుధాకర్, శ్యామ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ అంతరిక్ష దినోత్సవం

పటమట(విజయవాడతూర్పు): అంతరిక్ష పరిశోధన రేపటి ప్రపంచాన్ని మలచడంలో పోషించే కీలక పాత్ర అని ఇస్రో శాస్త్రవేత్త పుష్పవల్లి తాయరమ్మ అన్నారు. స్టెల్లా కాలేజీ భౌతిక శాస్త్ర విభాగం ఇన్‌స్పైర్ క్లబ్ ఆధ్వర్యాన జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని శాస్త్ర సాంకేతిక రంగంలో భారతదేశం సాధించిన విజయాలను ప్రతిబింబించే విధంగా ఘనంగా నిర్వహించారు. బెంగళూరు ఇస్రో ప్రయోగశాల శాస్త్రవేత్తలు తాయరమ్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ జసింతా క్వాడ్రస్, వైస్ ప్రిన్సిపాల్ జి. ఉష కుమారి, భౌతిక శాస్త్ర విభాగాధిపతి పద్మలత పలు కీలక మిషన్ల పనితీరును వివరించారు. డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ఆశ, ఇంటర్ వైస్ ప్రిన్సిపాల్ స్వప్న పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శనివారం చండీహోమం నిర్వహించారు. శ్రావణమాసం అమావాస్యను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో హోమం చేపట్టారు. పాడి పంటలు సమృద్ధిగా పండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆశిస్తూ హోమం నిర్వహించారు. హోమంలో సమీప గ్రామాల్లోని భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారు శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమంలోని శ్రీపంచతత్వ గురుపాదుక మందిరంలో శనివారం మహాచండీ హోమం నిర్వహించారు. తొలుత శ్రీగురుదత్తాత్రేయ స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం శనీశ్వరస్వామి వారికి నల్ల నువ్వులతో తైలాభిషేకం నిర్వహించారు. చంద్రశేఖర్, సరిత దంపతులచే వేద పండితుల మంత్రోచ్ఛరనలతో శాస్త్రోక్తంగా శ్రీమహాచండీ హోమం జరిపారు. అనంతరం భక్తులచే శ్రీలలితా సహస్రనామ పారాయణం చేశారు. ఆశ్రమ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిపారు.

సచివాలయాల్లో ప్రింటర్లు ఏర్పాటు చేయండి



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ శ్రీనివాసరావు

ఉయ్యూరు: సచివాలయాల్లో ప్రింటర్లు ఏర్పాటు చేయాలని 10వ వార్డు కౌన్సిలర్ పలియాల శ్రీనివాసరావు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సమావేశం కౌన్సిల్ హాలులో చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. పలు అభివృద్ధి పనులకు సంబంధించిన అజెండాలోని అంశాలను ఆర్‌ఐ చెన్నకేశవరావు కౌన్సిల్ ముందుంచారు. సభ్యులందరూ ఆయా అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. కౌన్సిలర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని పలు సచివాలయాల్లో ప్రింటర్లు పనిచేయటం లేదన్నారు. ప్రజలు సచివాలయాలకు వెళ్లి దరఖాస్తులు చేసుకుంటుంటే ప్రింటర్లు పనిచేయకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సచివాలయాలపై పర్యవేక్షణ కొరవడిందని, ప్రింటర్లు ఏర్పాటుచేసి సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. వెంటనే ప్రింటర్లు ఏర్పాటుచేయాలని ఇన్‌చార్జి కమిషనర్ రమ్యకు చైర్మన్ సూచించారు.

ధన్యవాద తీర్మానం..

నగర పంచాయతీగా ఉన్న ఉయ్యూరును గ్రేడ్–2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయటంపై కౌన్సిల్ ధన్యవాద తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా చైర్మన్ వల్లభనేని మాట్లాడుతూ మున్సిపల్ ఆదాయాన్ని గణనీయంగా పెంచామన్నారు. ఉయ్యూరు పట్టణ స్వరూపాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రేడ్–2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. కౌన్సిల్ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించి అప్‌గ్రేడ్ చేయటంపై ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేశారు. సమావేశంలో వైస్ చైర్మన్లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పారిశ్రామిక నైపుణ్యాలు అవసరం



విద్యార్థినులతో అనన్య ట్రస్టీ మహాలక్ష్మి, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు

రామవరప్పాడు: విద్యార్థులు ఉన్నత విద్యతో పాటు పారిశ్రామిక నైపుణ్యాలు పెంపొందించుకున్నప్పుడే ఉత్తమ పారిశ్రామికవేత్తలుగా రాణించగలరని విజయ ఇంజినీరింగ్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ తూమాటి వెంకటేశ్వరరావు అన్నారు. ఎనికేపాడులోని కళాశాలకు బెంగళూరుకు చెందిన అనన్య ట్రస్ట్‌తో శనివారం పారిశ్రామిక నైపుణ్యాలు పెంపొందించేందుకై అవగాహన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తూమాటి వెంకటేశ్వరరావు, అనన్య మేనేజింగ్ ట్రస్టీ ఫౌండర్ మహాలక్ష్మి పార్థసారథి ఎంవోయూ మార్చుకున్నారు.

విద్యార్థినులకు ఉపాధి అవకాశాలు..

ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులకు పరిశ్రమలలో తాజా పరిణామాలు, అవసరాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ ఒప్పందం జరిగిందన్నారు. సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులు, పారిశ్రామిక రంగం తీరుతెన్నులపై నిపుణులతో గెస్ట్ లెక్చర్లు, వర్క్‌షాపులు, అవగాహన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. వర్చువల్, బ్లెండెడ్, ఆఫ్‌లైన్‌లో విద్యార్థులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తారన్నారు. శిక్షణ పొందిన విద్యార్థినులకు ఉపాధి అవకాశాల కోసం అనన్య ట్రస్టీ సహకారం అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాఘవ లక్ష్మి, పలు విభాగాధిపతులు వై.విజయ, సుబ్బయ్య, విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న ఈగల్ సీఐ రవీంద్ర

గన్నవరం: గంజాయి వంటి మత్తు పదార్థులకు విద్యార్థులు దూరంగా ఉండాలని నార్కోటిక్(ఈగల్) సీఐ రవీంద్ర సూచించారు. మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో శనివారం మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ... మాదక ద్రవ్యాలకు బానిసై విద్యార్థులు తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి సేవించిన, విక్రయించిన చట్టరీత్యా నేరమని, కేసులు నమోదవుతాయని తెలిపారు. ఇటీవల రాజమండ్రి సెంట్రల్ జైలును పరిశీలనకు వెళ్లినప్పుడు గంజాయి కేసుల్లో నిందితులు ఎక్కువ మంది విద్యార్థులు ఉండడం బాధకరమన్నారు. గంజాయి నియంత్రణలో విద్యార్థులు కూడా భాగస్వాములు కావాలని చెప్పారు. గంజాయి విక్రయాలకు సంబంధించి ఎటువంటి సమాచారం ఉన్న పోలీసులకు తెలియజేయాలని కోరారు. గన్నవరం సీఐ బీవీ శివప్రసాద్, ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయక పందిళ్లకు అనుమతులు తప్పనిసరి



పెనమలూరు పీఎస్‌లో నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

పెనమలూరు: వినాయకచవితి పండుగ సందర్భంగా వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేసే పందిళ్లకు తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలని గన్నవరం సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో శనివారం వినాయక చవితి పందిళ్ల నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. వినాయక పందిళ్లు వేసే వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు చేసి అనుమతులు పొందాలని సూచించారు. ఇప్పటి వరకు 150 దరఖాస్తులు అందాయని తెలిపారు. వినాయక చవితి ఉత్సవాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా జరిగే ఊరేగింపులో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ వెంకటరమణ, ఎస్ఐలు, సిబ్బంది, వినాయక ఉత్సవాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

ఉయ్యూరు: వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో పండుగ వాతావరణంలో జరుపుకోవాలని సీఐ రామారావు సూచించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో శనివారం గణేష్ ఉత్సవ కమిటీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రామారావు మాట్లాడుతూ చవితి పందిళ్ల ఏర్పాటు, ఉత్సవాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. సింగిల్ విండో పద్ధతిలో కమిటీలు అనుమతి పొందాలని సూచించారు. వినాయక విగ్రహ నిమజ్జన ఊరేగింపుల్లో డీజేలకు అనుమతి లేదని స్పష్టంచేశారు. సమావేశంలో ఏఎస్ఐ వసంతరావు పాల్గొన్నారు.

బస్సులు మరమ్మతుల అనంతరం టెస్ట్ డ్రైవ్ చేయాలి



సిబ్బందితో కలిసి బస్సు టెస్ట్ డ్రైవ్‌కు వెళ్తున్న డీపీటీఓ వెంకటేశ్వర్లు

గన్నవరం: బస్సులకు మరమ్మతులు చేసిన తర్వాత రోడ్డుపై టెస్ట్ డ్రైవ్ కూడా చేయాలని జిల్లా ప్రజా రవాణా అధికారి కె.వెంకటేశ్వర్లు గ్యారేజ్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్, డిపోను శనివారం ఆయన పరిశీలించారు. తొలుత గ్యారేజ్‌లోని బస్సులను పరిశీలించిన ఆయన బస్టాండ్‌లో ప్రయాణికులకు కల్పిస్తున్న సదుపాయలను పర్యవేక్షించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకానికి మహిళల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. గన్నవరం డిపోలోని 61 బస్సులకుగాను 51 బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి అనుమతించినట్లు చెప్పారు. ఈ నెల 15 నుండి 22వ తేదీ వరకు ఈ డిపో పరిధిలో 1.10 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని, ఈ పథకం కింద రూ.34 లక్షలు రాయితీ పొందారన్నారు. ప్రయాణికుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు, బస్సు ఫెయిల్యూర్స్ లేకుండా సర్వీస్‌లు నడిపిన డిపో మేనేజర్, సూపర్‌వైజర్లు, సిబ్బందిని అభినందించారు. జీరో బ్రేక్ డౌన్స్ లక్ష్యంగా మరింత అంకితభావంతో పనిచేయాలని కోరారు. డీఎం పి.శివాజీ, సిబ్బంది పాల్గొన్నారు.